# తూర్పు-పడమర



ఆదూరి వెంకటరమణమూర్తి
బుద్ధరాజు జవహర్

స్పీడందుకున్న బస్సులో కూర్చున్న నాకు అప్పుడే దిగంతాలనుండి ఎర్రని బాతిలా ఉదయిస్తున్న సూర్యబింబాన్ని, అరుణిమ పులుముకున్న నీలాకాశాన్నీ చూస్తుంటే, 'ప్రభాతం' ప్రకృతిగీసిన చిత్రాలన్నింటిలో పరమోత్కృష్టమైన దిగా అనిపించింది. అప్పుడే చైతన్యం లోకి వస్తున్న ప్రకృతిని చూడగానే చెప్పలేని ఆనందం నా హృదయ వీధుల్లో రివ్వున వీచసాగింది.

ఎవరో అన్నట్లు అ ను భ విం చే మ న స్సూ, ఆనందించే నయనాలూ ఉండాలికానీ-జీవితం ఎంత మధురం! ఇలా ప్రకృతిని చూస్తూ యుగాల్ని సైతం క్షణాల్లా గడిపెయ్యవచ్చు, కానీ-ఇంత చక్కటి ప్రకృతి చిత్రాన్ని తిల కించే తీరికా, ఓపికా మనిషికి లేక పోయింది. అంతా యాంత్రికంగా బ్రతి కేయడానికే అలవాటుపడిపోయారు.

జీవితం ఆలోచనల్లో ఉన్న నాకు గోపాల్ గుర్తుకొచ్చాడు. వాడూ ఇంతే. ఎప్పుడూ జీవితానికి ఫిజికల్ అవుట్ లుక్ కావాలంటాడు. లౌకిక చింతన జీవితానికి మూలమంటాడు. నాకేమో నిజమైన ఆనందం జీవితాన్ని మానసికంగా-ఆధ్యాత్మికంగా అనుభవించినపుడే కలుగు తుంది. ఈ విషయంలో మా ఇద్దరి అభి ప్రాయాలూ తూర్పు-పడమరలు.

వాడి ఆలోచనలతోపాటు వాడు రాసిన ఉత్తరం గుర్తుకొచ్చింది. మళ్ళీ చదవాలనిపించింది. కాలక్షేపం కూడా అవుతుంది కాసేపు. జేబు తడుముకొని తీసాను.

"డియర్ అనంత్,

శుభవార్త! లైఫ్ ప్రాబ్లమ్‌లో ముఖ్యమైన స్టెప్- అదే మారేజి వరకూ నా లైఫ్ ప్రాబ్లమ్ సాల్వ్ చేసుకున్నా. నా పెళ్ళి కుదిరింది, 'ఇంకా పెళ్ళెప్పుడు చేసుకుంటావు?' అని వేధించే నీ ప్రశ్నకు జవాబుగా.

ఇక పెళ్ళి సంగతులంటావా? నీకు తెలుసుగా నా సంగతి- అంతా మేథమెటి కల్‌గా టాలీ చేసుకొనే ఈ పెళ్ళికి ఒప్పుకున్నాను.

పిల్ల అందమైంది. ఫామిలీస్థితి బాగుంది. గుణమంటావా? అది మనం చూసి నిర్ణయించలేనిది. పరిస్థితులబట్టి మారేది.

నా అందంసంగతి నీకు తెల్సు. నా చదువుసంగతి నీకు తెల్సు. మా ఫామిలీస్థితి నీకు తెల్సు. ఇక గుణం సంగతి? ఇవాళ్టిగుణం రేపటికి మారొచ్చు.

ఈక్వేషన్ రెండువేపులా టాలీ అయ్యింది. దాంతో మనం పెళ్ళికి ఒప్పేసుకున్నాం. 'వీడికేమన్నా పిచ్చా? ప్రతిదానికీ లెక్క-లేసుకుంటాడు' అని కదూ ఆలోచిస్తున్నావ్? ఊరికే అన్నారా మన పెద్దలు- 'సమాన కయ్యం-సమాన వియ్యం' అని. నిజానికి ఆ మాటలన్న వాడు పెద్ద మేథమెటీషియన్ అయ్యుం టాడు. ఈక్వేషన్ ఎప్పుడూ బేలన్స్ అవుతూ నే ఉండాలి. అందుకే నేను టాలీ వేసుకున్నా- సుమారు సరిపోయింది.

ఇక పెళ్ళి- మళ్ళీ బుధవారం అంటే ఇరవైమూడు సాయంత్రం అరుగంట లకు. స్థలం- సింహాచలం. పెళ్ళి పనుల సందడి వలన నిన్ను ప్రత్యేకంగా పిలవ లేకపోతున్నందుకు క్షమించి- పెళ్ళికి తప్పకుండా రా.

వీడేమిటీ పెళ్ళికూతురు సంగతి ఎత్తకుండా ఉత్తరం ముగించేస్తున్నాడను కునేవు. అదీ సస్పెన్స్! పెళ్ళిలో ఆమెని చూస్తావుకదా? ఎవరా అని నీకు ఆతృతగా ఉంది కదూ? అయినా ఆ మాత్రం సీక్రెసీ లేకపోతే లైఫ్ ప్రాబ్లమ్‌కి మజా ఏమిటీ?

ఉంటా
నీ
—గోపాల్."

ఒక్కసారి నవ్వుకున్నా. చిన్నప్పటి నించీ ప్రతి సంఘటనకూ మేథమెటిక్స్ అన్వయించి సొల్యూషన్ చెప్పే గోపాల్‌కీ నాకూ ఎలా స్నేహం కుదిరిందో ఇప్పటికీ నాకు ఆశ్చర్యంగానే ఉంటుంది.

వాడికి లెక్కలంటే మొదటినించీ ప్రాణం. నాకు ఆ సబ్జెక్టులో బండి చక్రాల పరిచయం ఉంది. వాడికి మాత్రం నూటికి నూరు మార్కులూ వచ్చేవి. తోటి విద్యార్థులే కాక, టీచర్స్ సైతం వాడిని లెక్కల్లో అఖండ మేధావిగా పొగుడుతూ ఉంటే నాకు తగని అసూయగా ఉండేది. కానీ, వాడు నా ఒక్కడితోనే చనువుగా తిరగడం నాకు మహదానందాన్నీ, గర్వాన్నీ ఇచ్చేవి. అటువంటి జీనియస్ నాలాంటి వాడితో తిరగడం నా కిప్పటికీ ఆశ్చర్యంగానే ఉంటుంది. "బర్డ్స్ ఆఫ్ ది సేమ్ ఫెదర్ టు గెదర్" మా ఇద్దరి విషయంలో మాత్రం అబద్ధం అనిపిస్తుంటుంది నాకు.

అటువంటి గోపాల్ 'జీవితం' అనే ఆఫీసులో బ్రహ్మచారి సెక్షన్నించి- సంసారి సెక్షన్‌కు ట్రాన్స్‌ఫర్ కాబో తున్నాడన్నమాట. ఈ సెక్షను వర్కుకి వాడు తట్టుకోగలడో లేడో? నా ఆలోచన నాకే నవ్వొచ్చింది.

"పిల్లసంగతి సస్పెన్స్" అన్నాడు. ఆ విషయం నన్ను దొలిచెయ్యసాగింది. ఎవరయి ఉంటారు. బహుశా ఆమె ఎవరో నాకు తెలిసే ఉంటుంది. అందుకే 'సస్పెన్స్' అన్నాడు. ఎవరయి ఉంటారన్న నా ఆలోచనకు తుది రూపం దొరకలేదు. పోనీ వాడికి తెలిసిన ఆడపిల్లలు ఎవరయినా ఉన్నారా అంటే- నాకు తెలిసినంతవరకూ లేరనే చెప్పాలి.

నిజానికి వాడికి మొదటినించీ ఆడపిల్లలంటే చచ్చేంత సిగ్గు- భయం. ఆ విషయంలో నేను వాడిని ఏడిపించిన సైనాలు కూడా ఉన్నాయి. అన్నిటికీ ఒకే జవాబు.

"అనంత్! మగవాడ్ని మనవాళ్ళు 'ప్లస్' అంటారు. ఆడవాళ్ళని 'మైనస్' అంటారుగా. ప్లస్ ఇంటూ మైనస్సయినా మైనస్ ఇంటూ ప్లస్ అయినా వచ్చేది మైనస్ కదా! మైనస్ ప్రాబల్యం ముందు ప్లస్ ప్రాబల్యం నిల్. అందుకే నాకు మైనస్ అంటే భయం. మైనస్ అమ్మాయి అని కదా- అందుకే అమ్మాయిలన్నా భయం. ప్లస్ అయిన పురుషుడి ప్రాబల్యం మైనస్ అనే అమ్మాయి

ప్రాబల్యం ముందు నిల్." వాడి సమాధానానికి విస్తుపోయాను. వాడి సమయస్ఫూర్తికి ఆశ్చర్యపోయాను.

అటువంటి గోపాల్ పోనీ ప్రేమ వ్యవహారంలో చిక్కుకుండాటా అంటే- నేను నమ్మలేను. కారణం వాడు ఒకసారి నాతో అన్నమాట ఇప్పటికీ గుర్తే!

"అనంత్! ప్రేమ విలువ లైఫ్ మేథమెటిక్స్‌లో జీరో."

"అంటే-"

"అంకె ముందు సున్నాకి మేథమెటిక్స్‌లో విలువలేదు. అంకె వెనుక సున్నాలు చేరేకొద్దీ దాని విలువ విపరీతంగా పెరిగిపోతుంది. అంతే ప్రేమ విలువ కూడా. మేరేజ్‌ముందు ప్రేమ అంకెముందు సున్నాలాంటిది. దానికి విలువలేదు. పెళ్ళి తర్వాత ప్రేమకే విలువ ఎక్కువ." అంత లేత వయసులో వాడి మేథమెటికల్ థింకింగ్‌కి ఆశ్చర్యపోయాను.

ఏమిటి వీడి వింతధోరణి? ఇటువంటివాడు జీవితంలో సుఖపడగలడా? సమాజంలో జీవించగలడా! నిజమైన ఆనందం అనుభవించగలడా? నా ఆలోచనల కడలిలో సందేహ తరంగాలు ఉప్పొంగేవి.

జీవితం మీద కూడా వాడికుండే అభిప్రాయాలు వింటుంటే- విస్తుపోయే వాడ్ని. వెర్రివాడిలా వాడివేపు చూస్తూండిపోయేవాడ్ని.

ఆరోజు నేను లెక్కల పుస్తకంతో కుస్తీ పడుతున్నాను. ఒక్క లెక్కకైనా ఆన్సర్ వచ్చే సూచనలు కనిపించలేదు నాకు. విసుగొచ్చి పుస్తకం మూలకు విసిరేసాను. 'బెర్నార్డ్‌షా'లా నేనూ తిట్టుకున్నాను. 'అసలు ఈ లెక్కల్ని ఎందులోనూ ప్రవేశపెట్టనివ్వకూడదు' అని లెక్కలు కనిపెట్టిన పెద్దల్ని కసితీరా మనసులో తిట్టుకున్నాను.

గోపాల్ మాత్రం వంచిన తల ఎత్తకుండా లెక్కలు చేసుకుపోతున్నాడు. దాంతో నాలో ఉక్రోషం పెల్లుబికింది వాడికి వినబడేలా-

"వెధవ లెక్కలు.... ఎందుకూ పనికిరావు చంపతున్నాయ్" అన్నాను. దాంతో చివ్వున ఒక్కసారి తలెత్తి చూసాడు నావైపు. పుస్తకం మూసేసి నావేపు తిరిగాడు.

"అయితే నాదో చిన్న సందేహం. మీ పోయట్స్ అంతా లైఫ్ అంటే ఏమనుకుంటారు?" డిస్కషన్ మునుపటిలా లెక్కలమీద కాక దీనిమీదకు మళ్ళడంతో నాకు ఇంట్రస్ట్ కలిగింది.

"జీవితాన్ని ఒక్కో కవీ- ఒక్కో విధంగా- ఒక్కో కోణంలో ఆలోచి.చి- ఒక్కో నిర్వచనం ఇచ్చారు. అసలు నన్నడిగితే- అది ఒక తియ్యని వరం. అనిర్వచనీయమైన అనుభవం. దానిని కేవలం బాహ్యదృష్టికంటే- మానసికంగా ఆధ్యాత్మికంగా అనుభవించడంలో పరి

పూర్ణత- సాఫల్యత లభిస్తాయి." నా సమాధానం విని పకపకా నవ్వాడు.

"ఏం నవ్వుతావ్ ?" నాలో ఉడుకు మోత్తనం ఉవ్వెత్తున లేచింది.

"నాదో చిన్న సందేహం. జీవితంలో ఫిజికల్ అవుట్ లుక్ ప్రాముఖ్యత తక్కువనే నీవు జీవితాన్ని ఎలా గడుపుతావు ?''

''అంటే- ?"

''అనంత్! కోపం తెచ్చుకోకు. మనిషి జీవితాన్ని గడపాలంటే లౌకిక చింతన చాలా ముఖ్యం. మనషులంతా మీ పోయట్స్‌లా వాస్తవిక దృష్టినుంచి తప్పుకుంటే- మీ పొట్టలు ఎలా నిండుతాయి ? జీవితాలు ఎలా పండుతాయి ? అందుకే అనంత్, నేను లైఫ్‌లో ఫిజికల్ అవుట్ లుక్‌కి అంత ప్రాముఖ్యత నిస్తాను." అన్నాడు గోపాల్.

"సరే! నా సంగతి విడిచిపెట్టు. జీవితం గురించి నువ్వేమంటావ్ ?" ఆసక్తిగా అడిగాను.

"లైఫ్ ఈజ్ మేథమెటిక్స్." బాణంలా వచ్చింది సమాధానం. గోపాల్ మళ్ళీ అందుకున్నాడు.

''నిజం అనంత్! ప్రతి మనిషి లైఫ్ ఒక పెద్ద మేథమెటికల్ ప్రాబ్లమ్. అది సాల్వ్ చేయవలసింది ఆ మనిషే అందుకే లైఫ్ మేథమెటిక్స్ సాల్వ్ చేయడానికి ప్రతిమనిషీ, ఓ పెద్ద మేథమెటీషియన్ అయ్యుండాలి. ప్రతి మనిషీ సాధించవలసింది 'ఎక్స్' అనుకుంటే లేదా పొందవలసింది 'ఎక్స్' అనుకుంటే- వాడికున్న తెలివితేటలు- అవకాశాలు- ఇత్యాదులు వాడి ప్రాబ్లమ్‌కి కావలసిన డేటా. వాటితో ప్రాబ్లమ్ సాల్వ్‌చేసి ఆ 'ఎక్స్'ని రాబట్టడమే జీవితం.

'ఇక జీవితం గడపడమెలాగంటావా? బండ పద్ధతుల ద్వారా లెక్క చెయ్యగలిగినా మనమొక విర్దుష్టమైన పద్ధతిలో లెక్కను సాల్వ్ చేస్తాము. అలాగే ఈ లైఫ్ ప్రాబ్లమ్‌ని-నిజమైన మేథమెటీషియన్ ఒక ప్లాన్డ్‌గా చేస్తాడు. వాడు సరియైనవాడు కాకుంటే- బండ పద్ధతిలో వెళితే- ఆ ఈక్వేషన్ లనబడే జీవిత సమస్యలతో తల బద్దలు చేసుకుంటాడు. అవే మనం చూస్తున్న కొన్ని దుర్గంధభరితమైన జీవితాలు.''

జీవితం గురించి ఎంత లోతైన ఆలోచన. భవిష్యత్తుమీద ఎంత ప్లాను. స్వశక్తిపై ఎంత నమ్మకం. మౌనంగా ఉండేవాడిలో ఎన్ని నిభిడీకృతమైన విజ్ఞాన ఝరులు. జీవితంలో ఇటువంటి వారేనేమో భవిష్యత్తులో మహాపురుషులౌతారు. నాలో ఏవేవో అలౌకికమైన ఆలోచనలు పొంగులెత్తాయి.

"అందుకే అనంత్ నాకు లెక్కలంటే ప్రాణం. అది మనిషిని ఆలోచింపచేస్తుంది. ఆన్సర్ వచ్చేవరకూ ఆగనివ్వదంటుంది. యోచనతోకూడిన ఆచరణ

ముఖ్యమంటుంది. నిజానికి నాకు ఎక్కడ చూసినా మేథమెటికల్ ఈక్వేషన్సే కనిపిస్తుంటాయి. జీవితంలో ఏ సంఘటన చూసినా యూనివర్స్‌లో ఏ విషయం తలచినా మేథమెటిక్స్‌కీ వాటికీ దగ్గిర సంబంధం ఉంకనిపిస్తుంది. అందుకే అనంత్ నాకు లెక్కలంటే ప్రాణం," అని ముగించాడు.

గోపాల్ మాటలు విన్న నాకు భయమేసింది. ఏమిటీ విపరీతధోరణి. భవిష్యత్తులో కొంపదీసి పిచ్చివాడు అవుతాడేమో? నాలో ఆందోళన కల్లోలిత సాగరంలా అనిపించసాగింది.

ఏది ఏమైనా వాడు అంతటి మేధావి గాబట్టివాడు రిసెర్చివరకూ వెళ్ళగలిగాడు. మరి నేను.... ఇంటర్‌తో చదువు ఫుల్ స్టాప్ పెట్టా. తాలూకాఫీసులో ఎల్. డి. గుమాస్తాగా బోర్డు కట్టేసా.

నా యింటి పస్థితులతో వాదన్నట్లు లైఫ్ ప్రాబ్లమ్ ఈక్వేషన్స్‌తో తలలు బద్దలు కొట్టుకొంటున్నా.

ఇద్దరు చదువుకొనే తమ్ముళ్ళు నా ఆశలను ఖద్దరు చొక్కాలకు పరిమితం చేసారు. రిటైరైన తండ్రి, సంసారమనే ముళ్ళకిరీటం నెత్తిమీద బలవంతాన పెట్టాడు. ఇటు కట్టుకున్న ఆలి - పెళ్ళి కాని చెల్లి - అటు మంచంమీద తల్లి. వచ్చేది నాలుగు వందలు. ఆదాయ వ్యయాల బేరీజులో మిగిలినవి నెరుస్తున్న వెంట్రుకలు. ముప్పయి యేళ్ళకే ముఖంమీద అరవై యేళ్ళ అనుభవాలు.

మరి గోపాల్.... అదృష్టవంతుడు. ఒక్కడే కొడుకు. వేల ఆస్థికి వారసుడు. అఖండ మేధా సంపన్నుడు. గుండెలు కెలికినట్లైంది. ఒకేచోట పెరిగిన ఇద్దరిలో ఒకడు లక్ష్మి సరస్వతుల ముద్దు బిడ్డడు. తను జేష్ఠాదేవి కౌగిట్లో నలిగి పోతున్న జడుడని.

ఆలోచిస్తే నాలోనే లోపముందని పిస్తోంది. మనిషికి యోచించే బుర్రతో పాటు, సాధించాలనే పట్టుదల, ఆచరణ ఉండాలి. కానీ ఈ సంకెళ్ళు....?

బస్సు విశాఖపట్నంలో దిగుతున్న నేను "ఎవరి జీవితాలు వారి స్వనిర్మితాలు" అన్నదాంట్లో సగమే నిజం అనుకునే నేను — పూర్తిగా నిజమన్న నిర్ణయాని కొచ్చాను.

* * *

పెళ్ళికి ప్రజెంట్ ఏమిద్దామా అని 'బుక్ షాపు' అంతా వెతుకుతున్న నన్ను 'ప్రాబబిలిటీ' మీద ఒక మేథమెటిక్స్ బుక్ ఆకర్షించింది. జీవితంలో ప్రతి సంఘటన జరగడానికి ప్రాబబిలిటీ ఎంత ఉందో నాతో చర్చించే గోపాల్‌కు అది మంచి ప్రజెంట్‌గా కనిపించింది. వెల చూసా. పదిహేను రూపాయలు. ఫరవాలేదు నా తాహతుకు తగిన కానుక. డబ్బు పే చేసి బుక్ తీసుకున్నా.

మొదటి పేజీలో ఏమి వ్రాద్దామా అని తర్జన భర్జన పడిన పిదప ఈ

విధంగా వ్రాసాను— "మానవ జీవితం విధియొక్క రాజ్యం. దానికి హద్దులు చావు పుట్టుకలు. ఈ రాజ్యంలో మనిషి ఎంత మేధావి అయినా అతడ్ని పాలించేది విధి. దానికి అనుగుణంగా నడవడమే మన విధి. ఆ విధి నీ విధి నిర్వహణలో చేయూత నివ్వాలని ఆకాంక్షిస్తూ—

నీ

—అనంత్"

మిగిలిన నా ఆఫీసు పనులు చూసుకొని హోటల్‌లో భోజనంచేసి బయటికొచ్చేసరికి పన్నెండున్నరయింది. పెళ్ళి ఆరుగంటలకు కదా! ఇప్పుడే వెళ్ళి ఏం చేయాలి? గోపాల్ పెళ్ళి హడావుడిలో ఉంటాడు. ఆలోచన్లతో నెమ్మదిగా నడుస్తున్న నేను ఉలిక్కిపడ్డాను, వీపు మీద ఎవరో తట్టడంతో.

"ఏమిటండీ! అనంత్‌గారూ.... పట్టపగలే రోడ్డుమీద అంత ఆలోచిస్తున్నారు." పరిచయమైన కంఠం వినిపించి వెనక్కి తిరిగిచూసాను.

వెంకటేశంగారు. ఒకప్పుడు అనకాపల్లిలో తన కో ఎంప్లాయి. ప్రస్తుతం విశాఖపట్నం కలెక్టరాఫీసులో పని చేస్తున్నారు.

"ఓ.... మీ రా!" అన్నాను ఆప్యాయంగా.

"రండి" అంటూ బలవంతంగా వాళ్ళ ఇంటికి తీసికెళ్ళిపోయాడు. సమయం ఎలా గడపాలా అనుకున్న నాకు కొంత కాలక్షేపం అయ్యింది.

ఇంటికి వెళ్ళిన తరువాత చేతిలో వున్న పుస్తకం ఏమిటన్నాడు. విషయం అంతా వివరించాను.

"ఏమిటి ఆ గోపాలంగారు మీ ఫ్రెండా?" అన్నాడు.

"అవును" అంతలోనే మెరుపులా ఓ ఆలోచన వచ్చింది.

"మీకు గోపాల్ తెలుసా?"

"అమ్మాయి వేపునించి తెలుసు" అన్నారు వెంకటేశంగారు.

"పెళ్ళికూతురు ఎవరు?" అని అడిగాను.

"మనం పనిచేసేటప్పుడు సీతారామ శాస్త్రిగారనే తాసీల్దారు లేరూ? వాళ్ళ అమ్మాయి వర్ధని"

"వర్ధనా!" నాలో ఆలోచనలు గిర్రున తిరగసాగాయి. అవును వర్ధనిని చాలాసార్లు చూసాను. చాలా అందంగా కూడా ఉంటుంది. గోపాల్ ఎంత అదృష్టవంతుడు. వర్ధనిని నేను మనసులో ఆరాధించేవాడ్ని. మధురంగా ఊహించుకునేవాడ్ని. కానీ, ఊహ దాటని నా ఆరాధన ఊబిలోనే మునిగిపోయింది. మరి గోపాల్? వాడు అదృష్టవంతుడు. కార్యవాది. నాలో ఒక రకమైన నిస్పృహ, నిర్వేదన కలిగాయి.

"కాని ... అనంత్‌గారూ! గోపాల్‌గారు చిక్కుల్లో పడ్డట్టేనండి" వెంకటేశంగారి మాటలకు ఉలిక్కిపడ్డాను.



"ఏమిటండీ?"

"అదే. వర్ధని మంచి అందగత్తె! కాదని ఎవరూ అనలేరు. కాని గుణం.... ఆ విషయం ఆలోచించినట్టు లేదు....మీ గోపాల్‌గారు. ఆమె ఒట్టి అహంభావి. ఖర్చు మనిషి. ఆమెతో జీవితంలో భర్తగా రాజీ కుదుర్చుకోవడం కత్తిమీద సాములాంటిది." నాలో మళ్ళీ ఆలోచనలు పొంగులెత్తాయి. నిజమే అయ్యుండాలి. వెంకటేశంగారికి వాళ్ళ ఫామిలీతో మంచి పరిచయం. ఆమె నడవడి ఆయన కనిపెట్టే ఉండాలి.

వెంకటేశంగారి మాటలు విన్నాక వర్ధని విషయంలో గోపాల్ చిక్కుల్లో పడ్డాడేమోననిపించింది. లెక్కల్లో అనుకున్న పద్ధతిలో ఆన్సరు రాబట్టలేకపోతే గోపాల్ తెగ బాధపడిపోతాడు. ఖర్చూ—అహంభావం రెండూ ఎక్కు-

వైన వర్ధని గోపాల్‌ను కష్టాలపాలు చేస్తుందేమో?

కానీ, నాలో ఒక మొండి ధైర్యం ఏర్పడింది. గోపాల్ అమెని తన దారికి త్రిప్పుకోగలడు. ఎంత గయ్యాళినైనా తన వేషకు త్రిప్పుకోగలిగే నేర్పు వాడి కుంది. అంతే కాకు-డా జీవితాన్ని ఎలా నడుపుకోవాలో నాకంటే బాగా ఆలోచించగలడు. లెక్కల్లో కూడా అవ్వరు రానని మొండికేసిన లెక్కను కూడా ఒదిలిపెట్టకుండా సాధిస్తాడు. ఆ పట్టుదల గోపాల్‌కుంది. ఈ రకమైన ఆలోచనలతో మనసు కుదుటపడింది.

సాయంత్రం నాలుగు గంటలవరకూ ఆయనతో పిచ్చాపాటీ మాట్లాడి, నేను బయటి కొచ్చేశాను. ఒక అరగంట లేటయినా సిటీబస్ దొరకడంతో కొండ మీదకు సరియైన టైముకే చేరుకో గలిగాను.

హిందూ వివాహ వ్యవస్థకు అత్యంత పవిత్రత చేకూర్చే మంగళవాయిద్యాల మోత మధ్య వివాహపుతంతు ముగిసింది. ఇద్దరికిద్దరూ చూడముచ్చటగా ఉన్నారు. గోపాల్ నన్ను చూడగానే ఉప్పొంగి పోయాడు. అది నాకెంతో గర్వమని పించింది. అంతటి స్థితిలో ఉన్నవాడు అందరి మధ్యా నన్ను అలా అభిమానిం చడం చూస్తుంటే నాకు మళ్ళీ జన్మలో కూడా గోపాల్ నా స్నేహితుడు కావాలనే భావన కలిగింది.

వచ్చిన అతిధుల స్థితి, హోదా వాళ్ళ వేష భాషల్లోనూ, కానుకల్లోనూ ద్యోతక మైంది నాకు. వాడి మామగారి వైపు వచ్చిన బంధువులు, వీడి రిసెర్చి మేట్స్, వాళ్ళ ప్రొఫెసర్ల మధ్య నేనొక్కడినే- మాణిక్యాల మధ్య మసిబొగ్గులా ఉన్నట్ల నిపించింది.

ఒక్కొక్కరి హోదాలు వాడు చెప్తుంటే సిగ్గుతో, నా స్థితికి తలవొంచు కున్నా. వాళ్ళిచ్చే విలువైన కానుకల మధ్య నా పుస్తకం నాకే సిగ్గనిపించింది. కానీ, వాడికి ప్రజెంట్ చేసినపుడు నేను ఇదే మాటంటే—

"అనంత్! మనిషికుండే ద్వేషం-- స్వార్థం 'హారం'గా ఎంచి, వాడిచ్చే కానుకను 'లవం'గా చేసి దాని విలువ కడతాను. నీలో ద్వేషం-స్వార్థం-'జీరో' 'జీరో' తో ఒకటిని భాగించినా వెయ్యిని భాగించినా లెక్కల్లో వచ్చే విలువ అనంతం--అంటే-- ఇనిఫినిటీ. ఇనిఫినిటీ కావడానికి క్రింద హారంతో పని కానీ, 'లవం'తో కాదు. అలాగే నువ్విచ్చే కానుకతో కాదు- దాని వెనుకనున్న ప్రేమతో దాని విలువ ముడిపడి ఉంటుంది," అని ముగించాడు గోపాల్.

"మొత్తానికి ఎప్లైడ్ మేథమెటిక్స్ అయినందుకు జీవితానికి నీ మేథమెటిక్స్ ఎప్లై చేస్తున్నావన్నమాట" అన్నాను.

"కాకుంటే చదువుకు విలువేమిటి చెప్పు?" నవ్వుతూ అన్నాడు గోపాల్.

వాడికి తిరిగి చెప్పి భోజనంచేసి బయలుదేరేసరికి తొమ్మిది గంట లయింది. డైరెక్ట్‌గా స్టేషనుకి వచ్చేసాను.

రైలులో కూర్చున్న నాకు బయట వెన్నెల అత్యంత మనోహరంగా కనిపించింది.

ఎవరో అన్నట్లు జీవితంలో తీయ నైనది స్నేహమేనేమో?-- నా అంత ర్వాణి మధురంగా 'అవును' అని అరిచింది.

* * *

రోజులు గడుస్తున్నాయి. రోజులతో పాటు నా జీతంరాళ్ళు పెరుగుతున్నాయి. సంపాదనతోపాటు సంసారం కూడా పెరుగుతోంది. హెడ్‌క్లార్క్‌గా ప్రమోషనొచ్చింది.

గోపాల్ పెళ్ళికి వెళ్ళినదగ్గర్నుండీ నాలో ఫిజికల్ అవుట్‌లుక్ పెరగ సాగింది. లోకంలో బ్రతకడం ఎలా? అన్న ప్రశ్న బలంగా నా బుర్రలో వేళ్ళుతన్నుకుంది. ఆలోచనలమధనంలో సమాధానం అమృతంలా దొరికింది. పనిచేసే బుర్రతోపాటు-- పరిశ్రమించే చెయ్యి కావాలి. అందుకే వీలయినంత వరకు శ్రమించాలనుకున్నా. పరిస్థితులు ఆకళింపు చేసుకోసాగా. ముందుచూపు నేర్చుకున్నా.

ఒకప్పటి నా జీవితంతో ఇప్పటి నా జీవితాన్ని పోల్చుకుంటే నాకే ఆశ్చర్యం వేస్తుంది. తల్లి జబ్బు నయమైంది. చెల్లి పెళ్ళిచేయగలిగాను. తమ్ముళ్ళను ప్రయోజకుల్ని చేయగలిగాను. పెళ్ళాం అవసరాలు తీర్చి ఆమె అభిమానం పొందగలుగుతున్నాను.

ఆలోచించే బుర్ర-- ఆచరించే శక్తి- రెండు పట్టాలూ సరిగా ఉన్నప్పుడు జీవితం అనే బండి గమ్యం వైపు సాగ గలుగుతుంది. ఏ ఒకదాంట్లో లోపం ఉన్నా బండికి ఏక్సిడెంట్ తప్పదు. ఆలస్యంగానైనా అతి చక్కటి ఆలోచన వచ్చినందుకు నన్ను నేనే అభినందించుకున్నాను.

గోపాల్ దగ్గర్నించి కూడా తరచు ఉత్తరాలు రాసాగాయి. వాడు బెంగుళూరులో మేథమెటిక్స్ డిపార్టు మెంట్‌లో వర్క్ చేస్తున్నాడు. కాలం ఒకేలా సాగదుగా.

రాను రాను గోపాల్ ఉత్తరాలు రాయడం తగ్గింది. కొన్నాళ్ళకు అక్క డ్నించి ఉత్తరాలు రావడమే ఆగి పోయాయి. ఎన్ని రాసినా జవాబులేదు. కారణం ఏమిటో నాకు అర్థంకాలేదు. నెత్తిమీద పడ్డ సమస్యలతో ఇంచుమించు గోపాల్ సంగతి మర్చిపోయాను.

కానీ, ఆ రోజు వెంకటేశంగారిని పనిమీద కలియవలసి వచ్చింది. మాటల సందర్భంలో గోపాల్ సంగతి దొర్లింది.

'గోపాల్‌గారు దురదృష్టవంతులండి' అన్నారు వెంకటేశంగారు.

ఆశ్చర్యపోయి- "ఏమైందండీ" అని అడిగాను.

"మీకు తెలియదా! వర్ధని ఆయనకి విడాకులిచ్చింది. దానితో పైవాళ్ళ సూటి పోటి మాటలకు తట్టుకోలేకపోయాడు. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాడు."

"వర్ధని విడాకులిచ్చిందా? ఎందుకని?" బాధతో నిండిన ఆశ్చర్యం గొంతులో కదిలింది.

"నేను ముందే చెప్పాను గదండీ. ఆమె అహంభావి. ఖర్చుమనిషి. పాపం గోపాల్‌గారు చాలారోజులు భరించారట. కాని ఖర్చు హద్దుదాటడంతో ఇద్దరి మధ్య ఘర్షణ. ఆ ఘర్షణలో రెచ్చిపోవడాలు. దానికి తోడు ఆయనదగ్గరకు ట్యూషన్ కొచ్చే అమ్మాయిలమీద ఆవిడకు అనుమానాలు. దానితో మొగుడూ పెళ్ళాల మధ్య వివాదాలు. ఈ సమస్యలు భరించలేకే ఆయన ఇంటికి రాకపోవడం అక్కడే ఆ రిసెర్చిలో మునిగిపోవడం. ఇది చాలక ఆవిడకి మొదటినుండీ లెక్కలంటే అసహ్యమట. దానికితోడు ఈయన ప్రతి మాటకూ లెక్కలు అన్వయించేవాడుట. దాంతో ఆవిడ విసిగిపోయింది. ఏదో గయ్యిమందిట. ఫలితంగా ఆమె దవడ వాచిందట. విడాకుల నోటీసిచ్చిందట. కోర్టువారు విడదీసారట. ఇదీ కథ. మొన్న సీతారామశాస్త్రిగారే చెప్పారు".

బాధ మేఘాల మధ్య మెరుపులా కదిలింది.

ఎంతటి మేధావి! ఆఖరికి ఇలా మారిపోయాడా? ఎంతటి మగవాడైనా మహా పురుషుడు కావాలన్నా- అధఃపాతాళానికి పోవాలన్నా ఆడదే కారణం.

మాణిక్యం సైతం వర్ధని చేతిలో మట్టిబెడ్డగా మారిపోయింది.

ఆ ఆలోచనలతో అన్నం సహించలేదు. ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఒకసారి ఎలాగన్నా గోపాల్‌ని చూడాలన్న కోర్కె నాటుకుంది. కానీ, ఎక్కడ దొరుకుతాడు .... వెంకటేశంగారిని అడిగితే ఫలితం కలుగవచ్చు.

మర్నాడు ఆఫీసులో కూర్చొని సెలవు చీటీ వ్రాస్తున్నాను మధ్యాహ్నం శలవుపెట్టి వెంకటేశంగారి దగ్గరకు వెళదామని.

ఇంతలో ఆఫీసు ప్యూన్ ఉత్తరం తీసుకొచ్చాడు.

గోపాల్ దగ్గర్నుండి. గుండె ఝల్లుమంది.

"అనంత్,

ఈ ఉత్తరం రాసేముందు ఓ సోక్రటీస్ సూక్తి చూసాను. అది నీకూ తెలిసే ఉంటుంది. "మనిషీ! నువ్వు ఒంటరిగా ఉన్నావా? వెంటనే పెళ్ళి చేసుకో. భార్య అనుకూలవతి అయితే సంసార సుఖం అనుభవిస్తావు. గయ్యాళి అయితే ఇంకేం - పెద్ద ఫిలాసఫర్ వౌతావు."

ఒకప్పటి నా భార్య వర్ధని మూలంగా

నాకు పెద్ద ఫిలాసఫర్‌నయ్యే భాగ్యం కలిగింది.

అనంత్!

నేను వర్ధని ముందు ఓడిపోయాను. జీవితం ముందు ఓడిపోయాను. నీ ముందే ఓడిపోయాను. మనిషికి కేవలం లౌకికదృష్టి ఒక్కటే ముఖ్యమని వాదించేవాడ్ని. నేను నమ్మిన ఆ లౌకిక దృష్టి నేను ఓడిపోతున్నప్పుడు- నాకే విధంగానూ సాయపడలేదు. నిజంగా నువ్వన్నట్లు మనిషికి కావలసింది ఆధ్యాత్మిక దృష్టి. అదొక్కటే విధి మనిషి మీద ఎదురు తిరిగినా ఆనందాన్ని కూర్చేది. జీవితం యొక్క పరిపూర్ణతను సాఫల్యతను చేకూర్చేది.

నేనన్నట్లు నా జీవితంలో సాధించవలసింది 'ఎక్స్' అనుకుంటే- దాని విలువ నేడు నాకు "జీరో" వచ్చింది. అంటే జీవితంలో నేను సాధించవలసింది ఏమీ లేదన్నమాట.

అనంత్! నువ్వన్నట్లే 'లైఫ్ ఈజ్ ది కింగ్‌డమ్ ఆఫ్ ఫేట్- అండ్ బర్త్ అండ్ డెత్ ఆర్ ఇన్ గేట్ అండ్ అవుట్ గేట్'. కానీ అనంత్, నా అనుభవం ఒక్కటి నేర్పింది - ఈ విధి రాజ్యమైన జీవితం విధికి అతీతమైనది ఏమిటో తెల్సా? మనిషికుండే ఆధ్యాత్మిక దృష్టి. దానివల్ల పొందే ఆనందం.... బాహ్యదృష్టి కెప్పుడూ రాదు.

ఇప్పుడు జీవితంలో నేను పొందే ఆనందం మునుపెన్నడూ పొందనిది. నిజం అనంత్. ఈ జీవితం ఇలాగే గడిపెయ్యాలనుకుంటున్నాను.

ఉంటా

నీ

—గోపాల్"

ఉత్తరం చదివిన నాకు కళ్ళు చెమర్చాయి. కాలం మనిషిలో ఎంతటి విశేషమయిన మార్పులు తెస్తుంది?

నేను ఆధ్యాత్మిక దృష్టినుంచి లౌకిక దృష్టికి చేరుకుంటే- వాడు- లౌకికదృష్టి నుంచి ఆధ్యాత్మిక దృష్టికి చేరుకున్నాడు. మేము చిన్నప్పుడు వేరు వేరు మార్గాల్లో నడిచాము ఇప్పుడూ మా మార్గాలు వేరే!

గోపాల్‌ని చూడగానే నాలో ఏదో బాధ తల ఎత్తింది. జీవితం కూడ ప్రకృతే! అందులోని నిరంతరం తూర్పు- పడమర- రెండూ ఎప్పుడూ ఎదురెదురే! రెండు కలియని దిక్కులు.

